క్లుప్తంగా

ఒకే ఈతలో రెండు దూడలు



వేలేరు: మండలంలోని గొల్లకిష్టంపల్లిలో సోమవారం ఓ ఆవు ఒక ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. గ్రామానికి చెందిన పాడిరైతు శ్రీపతి రమేశ్‌కు చెందిన హోలి స్టీన్ ఫ్రీజియన్(హెచ్.ఎఫ్) ఆవు మూడో ఈతలో ఒక ఆడ, మగ దూడకు జన్మనచ్చింది. రైతు రమేశ్ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

గుడిసెకు నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

దామెర: ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకుని మండలంలోని ల్యాదెళ్లకు చెందిన చింతం పోశవ్వ (101) సోమవారం మృతి చెందింది. పోశవ్వ గుడిసెలో నివాసం ఉంటూ జీవనం కొనసాగిస్తోంది. ఈక్రమంలో ఆదివారం రాత్రి పోశవ్వ కుమారుడు పోశాలును పెరుగు తీసుకురావాలని కోరింది. తీసుకొచ్చేలోగా గుడిసెకు మంటలు అంటుకొని పొగలు వస్తున్నాయి. దీంతో పోశాలు మంటలు ఆర్పేసి చూడగా.. అప్పటికే పోశవ్వ పూర్తిగా కాలిపోయింది. కాగా.. పోశాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు.

కరాటే లో సత్తాచాటిన బాలికలు

ఖిలా వరంగల్: హనుమకొండ జేఎన్ఎం స్టేడియంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి కరాటే పోటీల్లో ఉర్సుగుట్ట వరంగల్ మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొని సత్తాచాటారు. 22 మంది బాలికల హాజరై కటాస్‌లో విజేతగా నిలిచి ట్రోఫీ అందుకున్నారు. ఈమేరకు వారిని ప్రిన్సిపాల్ అంజిరెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు యువిజ్ఞ

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్ మాన్‌ఫోర్ట్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న ఎడ్ల యువిజ్ఞ.. జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గోపు విన్సెంట్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు స్కూల్‌లో సోమవారం నిర్వహించిన అభినందన సభలో యువిజ్ఞను అభినందించారు. ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. యువిజ్ఞను ప్రిన్సిపాల్‌తో పాటు తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పి.సాంబశివరావు, హనుమకొండ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ తాబేటి రాజేందర్, కోశాధికారి వి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి, స్కూల్ పీఈటీ ఆంథోని అభినందించారు.

ఆత్మవిశ్వాసంతోనే లక్ష్య సాధన

మడికొండ: ఆత్మవిశ్వాసంతోనే లక్ష్య సాధన సాధ్యమని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు కంజాపురం దామోదర్ అన్నారు. మడికొండ శివారులోని సాంఘిక సంక్షేమ బాలికలు గురుకుల కళాశాలలో విద్యార్థులకు సంస్కార వికాస శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. అంబేడ్కర్, పూలే వంటి మహానుభావులను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, వెంకటేశ్వర్లు, గంగారపు యాదగిరి, తాడూరి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బేడ బుడగజంగాలకు చైర్మన్ పదవి ఇవ్వాలి

నయీంనగర్: ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటుచేసి అన్ని రంగాల్లో వెనుకబడిన ఎస్సీ ఏ కేటగిరిలో ఉన్న బేడ బుడగజంగాలకు చైర్మన్ పదవి ఇవ్వాలని బేడ బుడగజంగం జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టో మేరకు ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, హైదరాబాద్‌లో వెయ్యి గజాల స్థలంలో కమిటీ నిర్మాణం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో, డబుల్ బెడ్రూం ఇళ్లల్లో 20 శాతం బేడ బుడగ జంగాలకు కేటాయించాలని సూచించారు. సమావేశంలో సంఘం నాయకులు తూర్పాటి లింగయ్య, గిర్ని వెంకట్, చంద్రమౌళి, జంపయ్య, సారంగపాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు

కాజీపేట అర్బన్: గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, వాటితో జీవితం చిత్తవుతుందని కాజీపేట ఎక్సైజ్ ఎస్సై మమత అన్నారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని సూచించారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజగోపాల్ పాల్గొన్నారు.

వెక్కిరిస్తున్న క్రీడా మైదానాలు



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న తిరుమలగిరి క్రీడా మైదానం



నిరుపయోగంగా మారిన కామారంలోని క్రీడా మైదానం

- పిచ్చిమొక్కలతో దర్శనం
- కానరాని స్పోర్ట్స్ కిట్ల పంపిణీ
- నెరవేరని సంకల్పం
- దృష్టిసారించని పాలకులు

ఆత్మకూరు : గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు, క్రీడాకారుల్లో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టిన క్రీడా ప్రాంగణాలు పిచ్చిమొక్కలతో వెక్కిరిస్తున్నాయి. యువకులకు క్రికెట్ కిట్లు తదితర క్రీడా సామగ్రి అందచేసి ప్రోత్సహించాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అదే విధంగా క్రీడా మైదానాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండడంతో క్రీడా మైదానాలు, క్రీడాకారులను పట్టించుకునే వారు కరువయ్యారని, రానున్న వేసవి కాలంలోనైనా మరిన్ని క్రీడా వస్తువులు కొనుగోలు చేసి ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు. కొన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారడంతో రాత్రి వేళ మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. క్రీడా మైదానాలను వినియోగంలోకి తీసుకొస్తే పిల్లలు సైతం క్రీడలపై దృష్టి పెడుతారని, సోషల్ మీడియా, టీవీలకు దూరమయ్యే అవకాశం ఉంటుందని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, పాలకులు దృష్టిసారించి క్రీడా ప్రాంగణాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించాలని అంటున్నారు.

హైనా దాడి.. మరో మూగజీవి మృతి

- భయాందోళనలో రైతులు



హైనా దాడిలో మృతిచెందిన దూడను పరిశీలిస్తున్న గ్రామస్తులు

ఐనవోలు : మండలంలోని గర్మిళ్లపల్లి వ్యవసాయ బావుల వద్ద గల పశువుల పాకపై ఆదివారం మరోసారి హైనా దాడి చేసింది. ఈ దాడిలో రాజారపు పోశాలుకు చెందిన మరో ఆవుదూడ మృతిచెందింది. గత నాలుగు రోజులుగా గ్రామంలోని శార్ల నారాయణ, బలబోయిన అక్కలికి చెందిన ఆవు దూడలపై హైనా దాడి చేసిన విషయం తెలిసిందే. కాగా గ్రామస్తులు చిరుత, పులి సంచరిస్తుందని భయాందోళన చెందుతున్నారు. ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేయగా సోమవారం ఉదయం ఎఫ్ఆర్ఓ భిక్షపతి, డీఆర్ఓ మోహన్, బీట్ ఆఫీసర్ రతన్‌లాల్ సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఆవుదూడలు చనిపోయిన తీరును, జంతువు గొళ్ల గుర్తులను బట్టి హైనా అని నిర్ధారించారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



విద్యారణ్యపురి: జనగామ ప్రాంతానికి చెందిన ఆంజనేయులు, మణెమ్మ దంపతుల కుమారుడు అందించిన విరాళం ద్వారా హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లను హనుమకొండకు చెందిన రామకృష్ణ సోమవారం అందజేశారని హెచ్ఎం ఎం.ఉమ తెలిపారు. 240 మంది విద్యార్థినులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు వివరించారు.

వ్యవసాయ రంగంపై అవగాహన అవసరం

కేయూ క్యాంపస్: ఆధునిక కాలంలో వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులపై యువతకు అవగాహన అవసరం అని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్ అన్నారు. కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో వ్యవసాయంపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ రహమాన్, శ్రీధర్‌కుమార్, వీరస్వామి, వ్యవసాయ శాఖ అధికారి భవ్య పాల్గొన్నారు.

ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలి



మహాసభలో అభివాదం చేస్తున్న నాయకులు

వరంగల్: పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని కార్మికులకు కనీస వేతనాలు అందిస్తూ ఈఎస్ఐ, పీఎఫ్‌ను వర్తింపజేయాలని సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు నైనాలశెట్టి మూర్తి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీటీయూ మొదటి మహాసభ ఫిబ్రవరి 9, 10వ తేదీల్లో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మూడోసారి అధికారంలో వచ్చిన మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను ఏర్పాటు చేసి కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చిందని విమర్శించారు. మహాసభలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. అనంతరం ఏఐసీసీటీయూ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశాల్లో ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి వి.శంకర్, రాష్ట్ర నాయకులు రమేష్‌రాజా, అక్కెనపల్లి యాదగిరి, గుమ్మడి రాజుల సాంబయ్య, ఖాజా మొహినొద్దీన్, రాష్ట్ర ఇన్‌చార్జ్ రొయ్యల రాజు, తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన



ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుడు శ్రీనివాస చార్యులు, ఆలయ నిర్మాత దాత గుండ్లపల్లి వెంకటేశ్వర్లు, సరస్వతి దంపతుల ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ నేతృత్వంలో విగ్రహ ప్రతిష్ఠాపన శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య, భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవనంపై దృష్టి సారించాలి



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

- కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవనంపై దృష్టి సారించాలని, సానుకూల దృక్పథంతో ముందుకెళ్లాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. విశ్వవిద్యాలయ మహిళా అధ్యాపకుల సంఘం, హనుమకొండ వాసవి ఆస్పత్రి సౌజన్యంతో క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఉమెన్ వెల్‌నెస్, అవేర్‌నెస్ ప్రోగ్రాం, అలాగే, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం మాట్లాడుతూ మహిళలు మానసిక ఒత్తిడితో ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం లేదని అన్నారు. డాక్టర్ వాసవి మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్, డాక్టర్ పద్మజ, డాక్టర్ శ్రీలత, డాక్టర్ దీపాజ్యోతి, మహిళా అధ్యాపకులు, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం నింపాలి



హసన్‌పర్తి: విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండలం ఎల్లాపురంలోని ఎస్పీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో వార్షికోత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజ్ఞానం నుంచి విముక్తిని కలిగించిన వారే నిజమైన గురువులుగా పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ గౌరిశెట్టి జగన్మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేషగిరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సన్నద్ధం కావాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వెంకన్న

హన్మకొండ: సంస్థ ఆస్తులు, డిపోలను కాపాడుకునేందుకు ఆర్టీసీ కార్మికులు సన్నద్ధం కావాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న పిలుపునిచ్చారు. హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ -1 డిపో వద్ద సోమవారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎన్నో ఏళ్లుగా సంపాదించుకున్న ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు అప్పగిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులను రద్దు చేసి, సొంతంగా సంస్థయే ఆ బస్సులను కొనాలని సూచించారు.

ఉచిత మోకాళ్ల వైద్య శిబిరం

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో ఈనెల 28వ తేదీ వరకు ఉచితంగా మోకాళ్ల వైద్య శిబిరం కొనసాగనుందని మెడికవర్ ఆస్పత్రి కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ రత్న కార్తీక్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత కన్సల్టేషన్, ఎక్స్ రే పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

డ్రైవర్ చాకచక్యం.. తప్పిన ప్రమాదం



కాజీపేటలో బస్సు దిగిన ప్రయాణికులు

కాజీపేట: విధి నిర్వహణలో ఉన్న ఓ ఆర్టీసీ డ్రైవర్ అనారోగ్యానికి గురికావడంతో పెద్ద ప్రమాదం క్షణాల్లో తప్పిన సంఘటన సోమవారం రాత్రి కాజీపేట పట్టణంలో జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం జనగామ డిపోకు చెందిన బస్సు హనుమకొండ నుంచి కాజీపేట మీదుగా జనగామకు వెళ్తుండగా బాపూజీనగర్ కూరగాయల మార్కెట్ సమీపంలోకి రాగానే ఆర్టీసీ డ్రైవర్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దాంతో బస్సును అతి కష్టం మీద అదుపు చేసి పక్కకు ఆపారు. ఒకసారిగా భారీ కుదుపుతో బస్సు ఆగడంతో భయాందోళనలకు గురైన ప్రయాణికులు ఏమి జరిగిందో అర్థం గాక డ్రైవర్ మద్యం తాగి ఉంటాడని భావించి దాడికి యత్నించడంతో కండక్టర్ అడ్డుకున్నారు. ప్రయాణికులు 100 డయల్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో సీఐ సుధాకర్ రెడ్డి అక్కడికి చేరుకుని డ్రైవర్‌కు డ్రంకెన్ డ్రైవ్ చేపట్టగా అలాంటి ఏమీ లేదని బస్సు నడిపించే సమయంలో అనారోగ్యానికి గురికావడమే కారణమని వెల్లడయ్యింది. డ్రైవర్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించారు.

వికసిత్ భారత్.. కేంద్ర ప్రభుత్వ లక్ష్యం



విద్యారణ్యపురి: వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎకనామిక్స్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ తిరుణహరి శేషు అన్నారు. హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ కళాశాలలో ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై సోమవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులకు ఫైనాన్షియల్ లిటరసీ అవసరం అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ పద్మ, అధ్యాపకులు శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, సామిల్ ప్రవీణ్‌కుమార్, సారంగపాణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బీసీ కులగణన

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : బీసీ కులగణనను ప్రభుత్వం పారదర్శకంగా చేపట్టిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణపై అవగాహన ర్యాలీ సోమవారం జరుగగా ఆయన హాజరై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కులగణన సర్వే అత్యంత పారదర్శంగా జరిగిందని, ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం చేసిన బీసీ కులగణన సర్వే సరిగా లేదని మళ్లీ సర్వే చేయాలని ప్రతిపక్షాలు వ్యాఖ్యలు చేయడం అవివేకమన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల కింద సమగ్ర కుటుంబ సర్వే చేసి కనీసం ఆ లెక్కలు కూడా ప్రజలకు చెప్పలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంటే ఓర్వలేకపోతున్నారని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం అమలు చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ మెంబర్ బాసాని చంద్రప్రకాశ్, పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ రవి, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ రవీందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల కేంద్రం ఏర్పాటే లక్ష్యం

మంత్రులకు వినతిపత్రం అందజేసిన నాయకులు



రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌ను నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నదే తమ లక్ష్యమని మండల సాధన సమితి సభ్యులు, జేఏసీ నాయకులు, గ్రామస్తులు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గల మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ ప్రాంత వాసుల ఆకాంక్ష నేరవేరుస్తూ ఉప్పల్‌ను వెంటనే మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు.

మంత్రులు, ప్రణవ్‌కు వినతి..

ఉప్పల్‌ను నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు తన సంపూర్ణ మద్దతు, సహకారం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ హామీ ఇచ్చారు. ఆదివారం రాత్రి జేఏసీ నాయకులు, గ్రామస్తులు ప్రణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే సోమవారం రాష్ట్ర మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి వినతిపత్రాలు అందజేశామని, వారు సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. నాయకులు నవీన్‌కుమార్, సంపత్‌రావు, దేవేందర్‌రావు, తోట సురేష్, రాజమౌళి, మహేష్, గణేశ్, ఉపేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కబ్జాదారుల బారినుంచి కాపాడండి

కమలాపూర్ : కబ్జాదారుల బారినుంచి తమ ఇళ్ల స్థలాలు కాపాడాలని కోరుతూ కమలాపూర్ బీసీ కాలనీకి చెందిన పద్మశాలీలు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాకు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితులు మాట్లాడుతూ.. ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాల్లో ఇళ్లు కట్టుకుంటుంటే కొందరు ఆ ఇళ్ల స్థలాలను కబ్జా చేసి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, మరికొన్ని ప్లాట్లను లక్షలాది రూపాయలకు విక్రయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్ మాట్లాడుతూ.. కమలాపూర్‌లోని బీసీ కాలనీలో పద్మశాలి కులస్తులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరుతూ ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశామని, సోమవారం సీపీకి ఫిర్యాదు చేసి కబ్జాదారులపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఆనందం, యువజన విభాగం అధ్యక్షుడు కృష్ణప్రసాద్, మురళి, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఖబరస్తాన్‌లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



ఖబరస్తాన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్

పరకాల : షాబాన్, రంజాన్ పండుగ సందర్భంగా ఖబరస్తాన్‌లను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు పరకాల మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్ తెలిపారు. సోమవారం పరకాల పట్టణంలోని ముస్లిం ఆబాది ఖబరస్తాన్, ఈద్గా ఖబరస్తాన్ స్థలాలను పరిశీలించారు. ఈనెల 13న షాబాన్ జాగారం ఉన్నందున పరిశుభ్రత పనులు, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని జామా మస్జిద్ మేనేజింగ్ కమిటీ నాయకులు విన్నవించారు. ఆయన వెంట మస్జిద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ గౌస్‌ఉద్దీన్, ఉపాధ్యక్షుడు తాజోద్దీన్, సెక్రటరీ అజ్మతుల్లా షరీఫ్, కమిటీ సభ్యులు యాకుబ్ పాషా, అజహరొద్దీన్, ఇమ్రాన్‌తో పాటు మస్జిద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రగ్బీ పోటీల్లో బిట్స్ విద్యార్థుల ప్రతిభ



పరకాల : ఈనెల 1 నుంచి 3 వరకు మంచిర్యాల జిల్లాలో జరిగిన అండర్ 15 రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడా పోటీల్లో పట్టణంలోని బిట్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్ల ప్రిన్సిపాల్ యుగేందర్ తెలిపారు. బాలికల జట్టు తరఫున విద్యార్థినీ బాలాజీ కావ్యాంజలి, బాలుర జట్టు తరఫున భాష బోయిన రామ్‌చరణ్, దూడపాక అభిరామ్ ప్రతిభ కనబర్చి ఈనెల 12,13వ తేదీన మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్‌లో జరుగుతున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని కోరారు. వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీకాంత్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఆత్మకూరు : బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అగ్రంపహాడ్‌లో ఇటీవల వివిధ కారణాలతో పలువురు మృతిచెందగా బాధిత కుటుంబాలను సోమవారం ఆయన పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు, మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు, నాయకులు స్వామి, రమేశ్, రాజు, సాంబయ్య, రవి, కృష్ణ, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన



వేలేరు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా గ్రామాల వారిగా ఓటరు జాబితాను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీస్ బోర్డుపై, మండల పరిషత్ కార్యాలయ నోటీస్ బోర్డుపై ప్రదర్శించినట్లు ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆరు ఎంపీటీసీ స్థానాలకు ఓటరు లిస్టును ఫైనల్ చేసి ప్రదర్శించినట్లు తెలిపారు.